


మల్లాది రవిశంకర్

# మేము సైతం...

దీపావళి పండుగ..!

సిటీ అంతా హడావిడిగా ఉంది. ఎక్కడ చూసినా రద్దీ.

బట్టల దుకాణాల్లో, టపాకాయల దుకాణాల్లో ఇసకేస్తే రాలనంత జనం...

ఆ హడావిడిని దూరం నుండీ చూస్తున్నాను.

ముఖాల్లో మతాబుల వెలుగుల్ని నింపుకొని.... తండ్రి వేళ్లని పట్టుకొని... హడావిడిగా వెడుతున్న పిల్లల్ని చూస్తున్నాను.

నాన్న వేలు పట్టుకుంటే అదే పెద్ద పండుగ.. అదే పెద్ద భరోసా.

నా చేయీ ఆ వేలు కోసం తహతహలాడుతుంది.

నాన్న ఆర్మీ ఆఫీసర్. కాశ్మీర్ బోర్డర్‌లో డ్యూటీ. సరిహద్దుల్లో... ఏ మూల నుండీ శత్రువు దేశంలోకి చొచ్చుకు రాకుండా వ్యూహరచన చెయ్యటం ఆయన పని.

నాన్నంటే నాకు ప్రాణం. నాన్నే నా హీరో.

ఆరుబైట... ఆకాశం కింద... అమ్మ పక్కన నిద్రపోతూ మధ్యలో మెలకువ వచ్చి... చందమామ వంక చూస్తుంటే...

నాన్న గుర్తొచ్చేవారు.

కాశ్మీరు లోయల్లో.... ఆ మంచు కొండల మధ్య.... కరిగిపోతున్న చందమామని నాన్న కూడా చూస్తూ....

నన్నూ, అమ్మనీ గుర్తు తెచ్చుకొని....

దూర తీరాల్లో ఉన్న నా బిడ్డనీ, భార్యనీ చల్లగా చూడమని చెప్పినట్టూ.... ఆ వార్త నాకు చెప్పాలని...

చందమామ ఆ మంచుకొండల నుండీ నా కోసం ఒక మంచు తునకని తనలో నింపుకొని దాన్ని నా మీద ఒక చినుకులా కురిపించి నిద్రలేపిన భావన...

నాన్న ఆలోచనలకి... నా కనుకొలకల్లో నిల్చిన వేడి కన్నీటి బొట్టుని నాన్న దగ్గరకి తీస్కెళ్లి..

ఆ చల్లని మంచుకొండల మధ్య నిద్రకి దూరమైన నాన్నమీద నా గుర్తుగా ఓ వెచ్చని చినుకుని వర్షించిన భావన...

నాన్న కోసం నెల్ల తరబడి ఎదురుచూస్తుంటాను.

ఒక చేతిలో సూట్‌కేస్... ఒక చేతిలో బెడ్డింగ్ పట్టుకొని వస్తూ.... దూరం నుండే నన్ను చూసి..

చేతిలో పెట్టెనీ, బెడ్డింగ్‌నీ కింద వదిలేసి....

చేతి గుప్పెడు మూసి, తన గుప్పిటని మూసిన నా గుప్పెటకి ఢీకొట్టి నన్ను అక్కున చేర్చుకుని నుదుటి మీద ముద్దు పెట్టుకుంటూంటే...

నాన్న కన్నీటి చుక్క... నా కన్నీటి చుక్కతో సంగమించిన క్షణం...

నా చిన్నగుండెకి కాదా అది గంగా సంగమం.

నాన్న కౌగిలికి తపించి పోతాను నేను.

సంవత్సరంలో దాదాపు పది నెలలు మేము కలిసి ఉండం. నాన్న డ్యూటీ బోర్డర్స్‌లో అక్కడ ఫ్యామిలీస్ ఉండే అవకాశం లేదు.

అందుకే....

సంవత్సరంలో రెండుసార్లు నెల రోజులు సెలవు మీద వచ్చేవాళ్లు నాన్న.

ఈ దీపావళికి నాన్న వస్తానన్నారు.

నాన్న కోసం అమ్మా, నేనూ ఎదురు చూస్తూ.... రోజులు లెక్క పెట్టుకునే వాళ్లం.

నాన్న రావటానికి రెండు నెలల క్రితం...

మందు పాతర పేలి నాన్న పోయారు.

నాన్న పోయారనే వార్త నా లేత మనసుని తీవ్రంగా పేల్చేసింది. అమ్మకి అది ఒక పెద్ద షాక్.

అమ్మ నుదుటి మీద సూర్యుడి లాంటి సింధూరం మాయమైంది. జడ సందుల్లో విరబూసిన మల్లెల తెల్లదనం దూరమైంది. ముఖంలో నవ్వుల పువ్వులు అదృశ్యమయ్యాయి. ఆ స్థానంలో నిర్లిప్తత.

దేశం కోసం ప్రాణం ఇచ్చిన వీరజవాను భార్యనని గర్వపడాలో లేక జీవితం తొలిపొద్దుల్లోనే కనీసం పాతిక దాటకుండానే మలిపొద్దుల్ని చవిచూసి జీవచ్ఛవంలాగా మిగిలిపోవాలో తెలీని అయోమయ పరిస్థితి అమ్మది.

నాన్నకి ప్రభుత్వం కాంపన్సేషన్ ఇచ్చింది. నా చదువుకు కూడా అసిస్టెన్స్ ఇస్తామని ఉత్తరం వచ్చింది.

అమ్మ జీవితం మోడువారిపోకూడదని, మళ్లీ పెళ్లికి అమ్మని ఒప్పించారు మామయ్యలు. ఆయనకి ఇద్దరు కొడుకులట. భార్య జబ్బు చేసి పోయిందట. చాలా మంచి వాడు. రైల్వేలో ఇంజనీరు. నన్నూ వాళ్లతో సమానంగా చూస్తానన్నాడు.

జీవితంలో రెండో నాన్ననీ, నాన్న స్థానంలో ఇంకో మగాడినీ చూడలేక డూన్ స్కూల్ హాస్టల్‌కి మూవ్ అయ్యాను.

అమ్మ కొత్త జీవితానికి అలవాటు పడిపోయింది. పెళ్లయిన కొత్తల్లో నా కోసం బాగా తపించి పోతోందని ఒకసారి సెలవుల్లో రెండు రోజులు వెళ్లాను.

అమ్మ కొత్త అత్తగారనుకుంటా-

"మొదటి సంబంధం కొడుకట. వీడు కూడా ఇక్కడే చేరుతాడో ఏమో!"

అని ఎవరితోనో అంటుంటే నా చెవిన పడింది.

అదే అమ్మ దగ్గరకి ఆఖరిసారిగా వెళ్లటం.

ఆ బంధం తెగిపోయింది.

నాన్న నాకు బాగా గుర్తొస్తారు. ఇంకా ఏ బంధాలూ లేని నేను నాన్నలాగా డిఫెన్స్ సర్వీసెస్‌నే ఎంచుకున్నాను.

'నేషనల్ డిఫెన్స్ అకాడమీ'లో సెలక్టయ్యాను. ఆ కోర్స్ సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేసి కమెండోగా, బాంబ్ డిఫ్యూజన్ స్క్వాడ్‌లో స్పెషలైజ్ అయ్యాను.

వృత్తిలో చవిచూసే జయాపజయాలే నాకు సంతోషం, సంతృప్తి.

నాన్న బాంబ్ బ్లాస్ట్‌కి గురి అయ్యారు. నాకు పట్టిన స్థితి ఏ పసికందుకీ పట్టకూడదని చాలా ఎలర్ట్‌గా ఉంటాను వర్క్‌లో.

* * *

పేపర్ బోయ్ ఆ రోజు న్యూస్‌పేపర్ పడెయ్యగానే ఆత్రంగా పేపర్ తిరగేశాను. నేను వెతుకుతున్న వార్త నాలుగో పేజీలో ఒక మూల చిన్నగా పడింది.

"పవర్‌ఫుల్ బాంబ్స్‌ని ఢిల్లీ నడి బొడ్డులో పేలకుండా డిఫ్యూజ్ చేసిన డిఫెన్స్ ఫోర్సెస్."


చాలా డిజప్పాయింట్ అయ్యాను ఆ వార్త చదివి.

నేను కీర్తి కోసం ఈ వార్త ప్రముఖంగా రావాలని ఆశించలేదు.

దేశ రాజధానిని సీరియల్ బాంబ్ బ్లాస్ట్స్ అతలాకుతలం చేస్తే...

వందలమంది అమాయక ప్రాణాలు తీవ్రవాదానికి బలయిపోతే....

అది ఒక పెద్ద వార్త, బ్రేకింగ్ న్యూస్, ఫ్లాష్ న్యూస్, ఇంటర్వ్యూలూ, విశేషాలూ, పోలీసుల ఇంటెలిజెన్స్ ఫెయిల్యూర్ అంటూ విమర్శలూ....



మీడియాకి ఇలాంటి వార్తలు పండగే.... చూపించిన క్లిప్పింగే మళ్లీ మళ్లీ చూపించి ప్రజల్లోకి చొచ్చుకుపోతాయి.

మరి...

ఒక పెద్ద ప్రమాదం జరగకుండా ఇంటెలిజెన్స్ వర్క్ చేసి.... వందల ప్రాణాలు ప్రమాదం నుండీ కాపాడితే, అది ఒక చిన్న వార్త అవుతుంది. ప్రాణాలకి తెగించి, పోలీసులూ, డిఫెన్స్ ఫోర్సెస్ తీవ్రవాదుల ప్లాన్‌లని బ్రేక్ చేసి, వాళ్లని పట్టుకుంటే..

ఆ... అదేమీ పెద్ద వార్త కాదన్నట్టు మూడో పేజీలో న్యూస్. టీవీలో ఆఖరి వార్త. ప్రమాదం జరిగితే... ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టే మంత్రులూ, నాయకులూ, మరి ప్రమాదాన్ని తప్పిస్తే....

కనీసం ఒక చిన్న అభినందన కూడా ఇవ్వరు.

పోలీసులూ, డిఫెన్స్‌ఫోర్సుల త్యాగాలనీ, వాళ్లు డ్యూటీ కోసం చేస్తున్న త్యాగాలనీ ఎప్పటికి గుర్తిస్తుంది ఈ లోకం?

పోలీసులంటే ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర ప్రజల్ని దోచుకునే వాళ్లలాగానో, కూరగాయల మార్కెట్లో లాఠీలతో బెదిరించి సంచీలు నింపుకునే వాళ్లలాగా ఉన్న ఈ ఇమేజ్ ఎప్పటికి మారుతుంది?

* * *

బోంబే తాజ్‌మహల్ హోటల్లో టెర్రరిస్ట్ ఎటాక్ దేశాన్నీ, శాంతి భద్రతలనీ అతలాకుతలం చేసింది.

ఎన్నో టీవీ ఛానెల్స్ అక్కడి ఆపరేషన్స్ లైవ్‌గా చూపించి దేశం నలుమూలల్లో ప్రజలకి మరింత ఆసక్తిని కలిగించాయి.

సిట్యుయేషన్ కంట్రోల్ చెయ్యటానికి రంగంలోకి దింపిన క్యాట్ కమెండోస్‌లో నేనూ ఒకడిగా సెలెక్ట్ అవటం నా జీవితంలో మరుపురాని సంఘటన. దేశం కోసం స్వార్థం లేకుండా, చావుకు సైతం భయపడకుండా పాటుపడే వాడే సైనికుడు.

మమ్మల్ని టెర్రరిస్ట్‌లు ఉన్న బిల్డింగ్‌లోకి ఎయిర్‌డ్రాప్ చేస్తుంటే చాలా గర్వంగా అనిపించింది.

కిందికి దిగిన మరుక్షణం అన్నీ మర్చిపోయి...వేగంగా నా విధి నిర్వహణ వైపు పరుగెత్తాను.

కొన్ని గంటల్లోనే టెర్రరిస్ట్‌లని కాల్చిపారేసి దేశాన్ని రక్షించాం.

ఆ క్షణం...

దేశం కోసం ప్రాణం కోల్పోయిన నాన్న, మబ్బుల మధ్య నుండీ నవ్వుతూ నన్ను చూస్తూ ఆశీర్వదిస్తున్న ఫీలింగ్.

"నాన్నా! నేను సైతం... నీలాగనే దేశం కోసం ప్రాణాలని పణంగా పెట్టాను. నా కర్తవ్యం ఎప్పుడు నిర్వహిస్తున్నా, చిటికెన వేలు పట్టుకొని నువు నడిపించిన మార్గమే గుర్తొస్తుంది. చిందిన ఒక జవాను రక్తం, శాంతిపావురం తెల్లని తెలుపుతో కలిసి, త్యాగానికి తార్కాణం కాషాయంగా మారుతుందేమో! నీవు చూపిన మార్గంలోనే ముందుకెళ్లే ధైర్యం, స్థైర్యం ఇవ్వు" అనుకున్నాను.

ఇలా ఆలోచనల్లో ఉండగానే...

కెమేరా ఫోకస్ చేసుకుంటూ ఒక న్యూస్ ఛానెల్ క్రూ, రిపోర్టర్స్ నా వైపు వస్తున్నారు.

వాళ్లకి ఏం చెప్పాలో నా మనసులో ఎప్పుడో ఫ్రేమ్ అయిపోయింది.

దేశానికి జరిగిన నష్టాన్ని మరీమరీ చూపించటమే కాదు మీ పని. ఒక బాంబ్ పేలకుండా ముందుగానే గుర్తించి, ప్రాణాలని పణంగా పెట్టి దాన్ని డిఫ్యూజ్ చేసిన సైనికుడ్ని చూపించండి.

మంచుకొండల్లో, బండరాళ్ల మధ్య తిండీ తిప్పలూ సరిగా లేకపోయినా దేశానికి పహారా కాస్తూ, భార్యాబిడ్డలకీ, బంధాలకీ అనుబంధాలకీ బలవంతంగా దూరంగా ఉంటున్న ఒక సైనికుడ్ని చూపించండి అని చెబుతాను. ○